# అద్దంలో బొమ్మ

ఉదయం పడకకి సిద్ధమవుతూ రవికి ఫోన్ చేశాను.

"చెప్పండి నాన్నా. రాత్రి ఒంటిగంటకొచ్చి ఇప్పుడు మళ్ళీ బయల్దేరుతున్నా. కంపెనీలో ఏవో గొడవలు. చాలా బిజీగా వుంది."

ఫోన్ కట్ అయింది. లేదా తొందరలో వుండి వాడే కట్ చేశాడేమో. మళ్ళీ చేశాను. సుందరి తీసింది. రవి భార్య. "ఈ రాత్రికి హైదరాబాద్ వెళ్తున్నానమ్మా. రెండు పెళ్ళిళ్ళున్నై. అఖిల మరిదిదీ, గణపతి బావమరిదిదీ." అఖిల నా కూతురు. గణపతి నా రెండో కొడుకు.

"సరే. వెళ్ళిరండి మామయ్యా. ఆ శుభలేఖలు మాకూ వచ్చాయి. మేము చాలా బిజీగా వున్నాం మామయ్యా. పైగా మీ మనవళ్ళిద్దరికీ పరీక్ష రోజులు. రాలేకపోతున్నామని చెప్పండి వాళ్ళకి" అని రిసీవర్ పెట్టేసింది. రవి బెంగుళూర్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. సుందరి ఏదో ప్రైవేట్ కంపెనీలో హెచ్‌ఆర్ హెడ్. ఆమె కూడా

బిజీ. ఇంట్లో పనిమనిషీ, వంటమనిషీ ఉన్నారు. అయినా సాధారణంగా ఇలాంటి ఫంక్షన్స్‌కి తాను రాలేనంటుంది.

– నడక మొదలెట్టాను. నడకతో పాటు నా ఆలోచనలూ సాగిన్నై. పాతరోజులూ, ఈనాటి రోజులూ..... మనుషులూ.... స్వభావాలూ... జీవనశైలీ అన్నీ కలగాపులగంగా తలపుకొస్తున్నాయి.

ఈ తరమంతా ఊపిరి సలుపుకోలేని బిజీ జీవితంలో పడి సతమతమవు తున్నారు. మా తరం వేరు. నేను చేసింది చిన్న ఉద్యోగం. పిల్లలకి మంచి చదువులే చెప్పించాను. ఉన్నంతలో తృప్తిగానే బతికాను. గణపతి హైదరాబాద్‌లో మార్కెటింగ్‌లో కుదురుకున్నాడు. గణపతి భార్య మాధవి. చిన్న ఉద్యోగం. ఇద్దరు ఆడపిల్లలు. అఖిల భర్త చీరాలలో క్లాత్‌మర్చంట్. వాళ్లకి ఒక్కడే కొడుకు. మిగిలింది నేనూ, అక్కయ్య చంద్రమ్మా. ఆమె మా ఇంటికి పాతకాపు. చిన్నతనంలోనే భర్త గతించాడు. భర్త తరపున ఏమీ లేదు, ఈమెకీ ఏమీ రాలేదు. మా కుటుంబంలో ఒకతయిపోయింది. పెద్ద దిక్కుగా నిలిచింది. పిల్లల్ని భుజాన్న వేసుకుని పెంచింది. నా భార్య శారదకీ, అక్కయ్యకీ మనసులు కలవటం ఒక పెద్ద అదృష్టం. శారద పోయి నాలుగేళ్లు. ఆమె పోయిన ఆర్నెల్లకే నా రిటైర్‌మెంట్.

రవికీ, గణపతికీ చెప్పింది చంద్రమ్మక్కయ్య. "ఏదో చారెడు గూడు వుంది గదా. చాలు. మీరు మమ్మల్ని రమ్మనలేరు. మేముగా వచ్చి మిమ్మల్ని బాధపెట్టాలనీ లేదు. మా రోజులిలా వెళ్లమారిపోనీయండి. చెరో వెయ్యా పంపండి. గడిచిపోతుంది" అని.

ఈ నాలుగేళ్ల నుంచీ అలాగే గడిచిపోతోంది.

– నడక ఒక రౌండు అయింది. వాకర్స్ కోసమే కట్టిన గట్టు మీద కూర్చున్నాను. బారులు తీరిన చెట్ల నుంచీ చల్లటిగాలి వీస్తోంది. మంచి మనసు. మాటలా పులకరింప చేస్తోంది కమ్మతెమ్మర.

నగరం నాజూకుతనం – వేకువరేకల్లో బయటికొస్తోంది. జనసంచారం మొదలవుతోంది. బిజీ జీవనం రోడ్డుకెక్కుతోంది.

"ఏమిటి మాష్టారూ ఆలోచిస్తున్నారు?" అంటూ వచ్చాడు విఠల్‌రావు. వాకర్స్ క్లబ్ వలన పరిచయాలు బాగానే పెరిగిన్నై. గట్టు మీద కూర్చున్నాడు.

"చెప్పండి. ఎలా వుంది మీ బిజినెస్?" అడిగాను.

"ఏం చెప్పను మాష్టారూ? రియల్ ఎస్టేట్ చేస్తున్నానంటేనే అదోలా చూస్తారు జనం. రిజిస్ట్రేషన్ సమస్యలూ, టైటిల్ గొడవలూ."

విఠల్‌రావుకి బ్యాంక్‌లో ఉద్యోగం. కానీ ఫ్లాట్ల వ్యవహారంలో బిజీ. ఇటు కొనేవారి దగ్గరా, అటు అమ్మేవారి దగ్గరా కమీషన్‌ని బాగానే లాగిస్తాడంటూ వుంటారు – తెలిసినవాళ్లు. ప్రమోషన్లు తీసుకోకుండా, విజయవాడలో స్థిరపడ్డాడు.

ఇంతలో కృష్ణమూర్తి వచ్చాడు. చిరునవ్వుతోనే పలకరించాడు. పక్కగా కూర్చున్నాడు. అతన్ని చూసి లేచాడు విఠల్‌రావు. "ఏవైనా బేరాలు తెలిస్తే చెప్పండి సారూ. నన్ను మరచిపోకండి. ముగ్గురాడపిల్లల తండ్రిని. ఎంతొచ్చినా దిగలాగుడుగానే వుంది" అని వాచీ చూసుకుంటూ లేచి వెళ్లిపోయాడు.

విఠల్‌రావు మాటలు విన్న కృష్ణమూర్తి అదోలా నవ్వేడు. "పెద్ద హేండ్ సార్ – ఇతను. ఎప్పుడూ బిజీనే. నీతో మాట్లాడితే నాకేమిస్తావ్ అనే రకం. పెద్ద బనేవా!" అన్నాడు.

"అంటే?" అడిగాను. నిజంగానే బనేవా అంటే అర్థం కాలేదు.

"బనేవా – అంటే బతకనేర్చినవాడు సార్" అని నవ్వేడు. నాకూ నవ్వొచ్చింది. కృష్ణమూర్తి ఆర్ఎంపీ. అతని హస్తవాసి మంచిదని చుట్టుపక్కల పెద్దపేరు. సన్నకారు, చిన్నకారు రోగులకి అతనొక ఆపద్బాంధవుడు. ఉదయం తొమ్మిది నుంచీ రాత్రి పది దాకా బిజీ... బిజీ అతను. కృష్ణమూర్తి సెల్ మ్రోగింది. "ఆ.... వస్తున్నా...." అంటూ లేచి, "వస్తా మాష్టారూ" అని చకచకా వెళ్లిపోయాడు.

పూర్తిగా వెలుగొచ్చింది. నగరం రొద మొదలైంది. నవ్వడీ, వడీ జోరందుకున్నై. మనుషులంతా బిజీ. పరుగో పరుగు.....!

నేను లేచి ఇంటిముఖం పట్టాను.

దారిలో కాశీపతి ఇంటికి వెళ్లాను. అప్పటికే అతనెక్కడికో వెళ్లటానికి సిద్ధమవుతున్నాడు. కాశీపతి మా ఇంటి పురోహితుడు. "మా అమ్మ ఆబ్దీకం తిథి రేపు సోమవారం కాశీపతీ. గుర్తుచేసి పోదామని వచ్చాను" చెప్పాను. "ఆఁ. నాకు గుర్తే మాష్టారూ?" అని "కొంచెం పనుంది మరి, వెళ్లిరానా?" అని చెప్పుల్లో కాళ్లు పెట్టాడు. నేనూ కదిలాను.

"క్షణం తీరిక లేదు, దమ్మిడీ ఆదాయం లేదు అన్నట్టుంది" అని తనకు తాను చెప్పుకుంటూ సైకిల్ తీశాడు. పిల్లాజెల్లా లేరు. భార్య ఏదో మాల్‌లో సేల్స్‌గాళ్‌గా

చేస్తుంది. టైమ్ లేదనే అంటూ వుంటాడు. ఇక్కడా అక్కడా స్థలాలూ, పాతకొంపలూ కొంటున్నాడని చెప్పుకుంటూ వుంటారు - చుట్టుపక్కలవాళ్లు!

- అలవాటుపడిన కాళ్లు మా ఇంటిముందుకొచ్చి ఆగినై. లోపలికి నడిచాను. రాజశేఖర్ కాఫీ తాగుతూ కూర్చుని వున్నాడు. అతను నా మేనకోడలు కుమారి భర్త. గవర్నమెంట్ ఉద్యోగి. వేరే వక్కపొడీ, ప్లాస్టిక్ కవర్లూ తయారుచేస్తాడు. చిన్న కుటుంబ పరిశ్రమ. వాటిని షాపులకి వేయటమే కాక, శుభకార్యాలకి, పరిచయస్థులకి సప్లయి చేస్తూ వుంటాడు. కుమారీ ఈ వ్యవహారాలకి అలవాటుపడింది.

"గణపతికీ, అఖిలకీ చెప్పండి మామయ్యా. మేము రాలేకపోతున్నాం. ఈ కవర్లూ, ప్యాకెట్లూ వాళ్లకి అందజేయండి." గిఫ్ట్‌చెక్స్ ఉన్న గ్రీటింగ్ కవర్లూ, వక్కపొడీ, ప్లాస్టిక్ కవర్లూ ఉన్న ప్యాకెట్లూ ఇచ్చాడు. బిజీగా ఉన్నామని చెప్పండి మామయ్యా" అని మళ్లీ చెప్పాడు. నేనతని భార్యకి మేమామనైనా, అతను కూడా నన్ను మామయ్యా అనే పిలుస్తాడు!

"ఏం బిజీనో పాడో. సంపాదనలో పడి కొట్టుకుపోతున్నారు. మనుషులు...." అని లోపల్నుంచీ చంద్రమ్మక్కయ్య ఏదో అంటున్నది కానీ, రాజశేఖర్ సెలవు తీసుకుని వెళ్లిపోయాడు. నేను నిరాసక్తితో పెదవి విరిచాను. "ఇట్లా వుంటే సంబంధాలేం నిలుస్తయ్యింక" - అక్కయ్య!

\+ \+ \+

హైదరాబాద్ చేరేసరికీ ఉదయం తొమ్మిదయింది. బస్ లేటు. ఇంటికి వెళ్లేసరికీ మనవరాళ్లిద్దరూ స్కూల్‌కి వెళ్లిపోయారు.

గడపలో నిలబడి హడావిడి పడుతున్నారు గణపతీ, మాధవీ. "తొమ్మిదికి గడపదాటకపోతే, ట్రాఫిక్‌తో ఆ రోజు అవుట్. ఒక రోజు సెలవు గోవిందా" అని గణపతి చెప్తుంటే, "అన్నీ టేబుల్ మీద సర్ది వుంచాను మామయ్యగారూ. కాఫీ ఫ్లాస్క్‌లో వుంది. ఇవ్వాళో అర్జంటు పనుంది. సెలవు లేదన్నాడు మా ఆఫీసరు. స్నానం చేసి భోజనం చేసేయండి. విశ్రాంతి తీసుకోండి. నాలుగింటికల్లా పిల్లలొచ్చేస్తారు" అని తానూ కాలు కదల్చింది మాధవి.

సిటీలైఫ్ మరి. బిజీ. వాళ్ల శ్రమని నేనూహించుకోగలను.

స్నానం అయింది. పేపర్ చేతిలోకి తీసుకుని బాల్కనీలో కూర్చున్నాను. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో కార్లూ, స్కూటర్లూ కదిలిపోతున్నై. ఎక్కువమంది జంటజీతాల దంపతులే. వీరందరికీ ఆఫీస్‌టైమ్ పదో, పదిన్నరో..... అనిపించింది.

జనమంతా ఉరుకులూ పరుగుల పళ్లచక్రంలో ఇరుక్కుపోయిన వారే. అందరి మొహాల్లోనూ టెన్షనే. ఒక్కమనిషీ నవ్వడు కాబోలు! ఏ ఒక్కరూ హాయిగా బతుకుతున్న కళ లేదు.

నాలుగు దాటుతుండగా రజనీ, రాగిణీ వచ్చారు. డ్రెస్‌లు మార్చుకుని వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. టిఫిన్ చేశారు. కబుర్లు చెప్పారు. ఉన్నట్టుండి రాగిణి లేచింది. "సారీ... తాతయ్యా ఇవ్వాళ హోమ్‌వర్క్ ఎక్కువుంది" అంటూ తన గదిలోకి నడిచింది. మరో కొద్దిసేపు నాతో తన స్కూల్ గురించి చెప్పి, "టెన్త్ కదా. చాలా ప్రిపేర్ కావాలి తాతయ్యా" అంటూ తానూ గదిలోకి కదిలింది రజని. అవును, వాళ్లూ బిజీ!

– రాత్రి భోజనాలైనాయి. లోకాభిరామాయణం, మా బంధువుల యోగ క్షేమాలూ సాగినై. పిల్లలు నిద్రకుపక్రమించారు. ప్రసంగానుప్రస్తకం చెప్పుకొచ్చింది మాధవి "అస్సలు ఏ పనికీ టైమ్ చాలదు మామయ్యగారూ. పోనీ ఉద్యోగం వదిలేద్దామా అంటే – ఆగి భర్తవైపు చూసి,"ఆడపిల్లలు. అనేక ఖర్చులు. నా జీతం ఐదువేలే అయినా, కనీసం మీకు పంపటానికీ, చిల్లర ఖర్చులకీ వస్తుందని అవస్థ పడాల్సొస్తోంది...." అన్నది.

నాకు మనస్సు చివుక్కుమంది. నేను వాళ్లకి భారమనే సంగతి లౌక్యంగా చెప్పిందా మాధవి – అనిపించింది. గణపతి మొహంకేసి చూశాను. ఏ భావమూ తోచలేదు. ఆ రాత్రి ఈ ఆలోచనతోనే గడిచింది నాకు.

మర్నాడు ఉదయాన్నే మాధవి, పిల్లల్ని తీసుకుని సైనిక్‌పురి – వాళ్లమ్మ గారింటికి – వెళ్లిపోయింది. తమ్ముడి పెళ్లిగదా అని రెండు రోజులు ముందుగా రమ్మని మరీ మరీ అడిగారట వాళ్ల వాళ్లు.

నేను రాధమ్మ గారింటికి బయల్దేరాను. రాధమ్మ నా బాల్యమిత్రుడు గుర్నాథం కూతురు. ఉండేది మల్కాజిగిరి. ఈ రెండు రోజులూ వాళ్లింట్లో వుండి, ఆ మర్నాడు గణపతి బావమరిది పెళ్లికి వెళ్లాలి. ఆ మర్నాడు అఖిలా వాళ్లింటికి మకాం. ఇదీ నా ప్రోగ్రాం. అఖిల అత్తగారూ, మరుదులూ ఈ ఊరివారు. అందుకని ఆ పెళ్లీ ఇక్కడే.

నే వెళ్లేసరికీ రాధమ్మ భర్త శ్రీధర్ ఆఫీస్‌కి బయల్దేరుతున్నాడు. అతని ఉద్యోగం హైటెక్‌సిటీ దగ్గరట! వాళ్ల ముగ్గురు పిల్లలూ అప్పటికప్పుడే స్కూల్స్‌కి వెళ్లిపోయారు. పరామర్శలూ, కుశలప్రశ్నలూ అయిన తర్వాత శ్రీధర్ వెళ్లిపోయాడు. నాకు టిఫిన్ పెట్టింది రాధమ్మ. కబుర్లు కలపోసుకుంటూ కాఫీ కూడా పూర్తిచేశాను.

నేను మ్యాగజైనేదో చేతుల్లోకి తీసుకున్నాను. ఎవరో నడి వయస్సు స్త్రీ వచ్చింది, రాధమ్మని పిలుస్తూ. "మా బంధువులొచ్చారు రాధమ్మగారూ. రెండ్రోజులు ఉండి వెళ్తారనుకున్నాం. కానీ, వాళ్లు ఇప్పుడే ప్రయాణమైనారు. ఉత్తచేతుల్తో ఏం పంపుతాం. అందునా వాళ్లింట్లో ఈయన రెండేళ్లుండి చదువుకున్నార్ట ఆ రోజుల్లో. రెండు శారీస్ ఇవ్వండి."

నవ్వు మొహంతో, "అవును... అంతేగామరి... అలాగే" సమాధానాలతో గదిలోకి వెళ్లి శారీస్ తెచ్చి టేబుల్ మీద ఉంచింది రాధమ్మ. ఆ వచ్చినావిడ వాటిల్లోనుంచీ రెండు ఎంచుకుని తీసుకెళ్లింది."డబ్బులకేంగానీండి. చీరెలు బాగున్నయ్" అంటూ "సాయంత్రం ఇచ్చేస్తాలెండి పైసలు" అని వెళ్లిపోయింది.

నా మనసులోని ప్రశ్నలకి సమాధానమా అన్నట్టు చెప్పసాగింది రాధమ్మ. "ఆయనకొచ్చే నాలుగురాళ్లతో ఏం నెట్టుకొస్తాం చెప్పు బాబాయ్. పిల్లలు ముగ్గురూ చదువుల్లో కొచ్చారు. స్కూల్ ఫీజులూ, ట్యూషన్ ఫీజులే చాలా అవుతున్నయ్. అన్నీ పెద్ద ఖర్చులే. పైగా సిటీలైఫ్. అందుకని ఇంట్లోనే ఈ వ్యాపకం పెట్టుకున్నా. క్లాత్ బిజినెస్‌లో లాభం ఎక్కువ. రెండు నెలలకోసారి, ఏ విజయవాడో, చీరాలో వెళ్లి సరుకు తెస్తాను. మా కాలనీ వాళ్లంతా ఈ చీరెల్నీ, డ్రెస్ మెటీరియల్‌నీ బాగా లైక్ చేస్తారు," అని నవ్వుతూ, "టైమ్ చాలటం లేదు, పిల్లల పనులతో. చాలా బిజీగా ఉంటుంది. లేకపోతే ఇంకా ఇంప్రూవ్ చేయవచ్చు" అన్నది. ఏమనాలో తెలీక "చాలా బాగుందమ్మా" అన్నాను.

నా మేధ ఆలోచనల సుడిలో.... ఇక్కడా బిజీ.... కొత్త కొత్త ఆదాయ వనరుల కోసం వెంపర్లాట. అర్జనా మార్గాల అన్వేషణ!

–రాత్రి భోజనాలైనాయి. అదే కాంప్లెక్స్ రెసిడెంట్స్ అసోసియేషన్ కార్యదర్శట .ఆయనొచ్చాడు. పేరు స్వామి. పిచ్చాపాటీగా మొదలైన మాటకచ్చేరీని స్వామి తన 'బిజినెస్' వైపు మళ్లించాడు. పోస్టల్ పొదుపు పథకాల గురించిన వివరాలు చెప్పసాగేడు. శ్రీధర్‌కి చెప్తూనే, మధ్య మధ్య నన్నూ ఉద్దేశించి, గిట్టుబాటయ్యే వడ్డీరేట్లు చెప్పుకొచ్చాడు. "సరే ఆలోచిస్తా"నని ఆయన్ని పంపించాడు శ్రీధర్.

"భార్య పేరుతో పోస్టల్ ఏజెన్సీ వుంది. సంవత్సరానికో నాలుగు లక్షల ఆదాయంట. బిజీ కాక ఏమవుతుంది" అన్నాడు శ్రీధర్ – స్వామి గురించి చెప్తూ.

అందరి ఆలోచనకీ కేంద్రకం సంపాదన! డబ్బు, డబ్బు! బిజీ... బిజీ!

చదివి, చదివి.... నిద్రలకి తయారవుతున్నారు రాధమ్మ పిల్లలు. ఇద్దరు

ఆడపిల్లలూ, ఒక పిల్లవాడూ. రేపటి పౌరులు. పోటీ ప్రపంచంలో, డాలర్ కలలతో – ఊపిరి సలుపనీయని 'బిజీ' చదువు! వీళ్లంతా ఎప్పుడూ టైమ్‌లేని విద్యార్థులు! ఎన్నటికీ 'టైమ్' లేని విత్తార్థులు! నేడూ, రేపూ కూడా వీరి జీవనగమనంలో పరుగే, పరుగు!

నా కళ్లల్లో నీటితెర. రెప్పలు తడుచుకున్నాను. వాటి వెనుక క్షోభ ఏదో తెలియని ఉద్వేగంతో గుండెని బరువెక్కించింది.

–పెళ్లిళ్లు అయినై. తిరిగి విజయవాడ చేరేను.

+ + +

సాయంత్రం నాలుగయింది. టీ తాగి ముందుగదిలో కూర్చున్నాను. చంద్రమ్మక్కయ్య ఏదో గుడికి వెళ్లింది. పురాణ ప్రవచనాలంటే ఆసక్తి. వీధిగుమ్మం తలుపు తీశాను. మాది వీధివార ఇల్లు. రోడ్, జనసంచారం, వాహనాలూ అన్నీ కనిపిస్తున్నై. అన్ని రకాల బతుకు పోరాటాలూ అక్కడే జరిగిపోతూ వుంటాయి. రోడ్‌కి ఆవల దుకాణాల వరుస. ఎదురుగా పెద్దమాల్.

లేచి గుమ్మంలోకొచ్చాను. మా యింటి మెట్ల మీద ఎవరో హమాలీ. వయసెంత వుంటుందో తెలియనీయని ఆకారం. ముగ్గు బుట్టలాంటి జుట్టు.

గుమ్మంలోంచీ మెట్లమీదికొచ్చి పరీక్షగా చూశాను.

బీడీ వెలిగించుకుని తృప్తిగా పొగపీలుస్తూ ఆనందిస్తున్నాడు. మొహం అనాకారిగా వుంది. గుంటలు పడిన కళ్లు. చిరుగుల బనీను. చెమటపట్టిన దేహం. చూసిన మొహమే అనిపించింది. క్షణం ఆలోచిస్తే స్ఫురించింది. ఎదురుగా వున్న మాల్‌లోకి సరుకులు చేరవేస్తూ వుంటాడు. ఏ లోడ్ లారీయో, టెంపోనో వచ్చినప్పుడు – బస్తాలూ, టిన్నులూ, బాక్సులూ దించి మాల్‌లో చేరుస్తూ వుంటాడు.

తలతిప్పి నాకేసి చూశాడు. మాట్లాడాలనిపించింది. ఎలా మొదలుపెట్టాలా అనే ఆలోచనలో పడ్డాను. క్షణాల తర్వాత అడిగాను, "బండపని. చాలా శ్రమపడుతున్నావ్. మాల్ వాళ్లు ఏమిస్తారు?" అని.

నా కళ్లల్లోకి సూటిగా చూశాడు. బహుశ తన గురించీ, తన శ్రమ గురించీ ఈ విచారణలూ, సానుభూతీ – చాలామంది నుంచీ వచ్చినట్లుంది. "ఐటమ్‌కి ఇంతని ఉంటుంది. ఎంతొస్తే అంత...." అన్నాడు, యథాలాపంగా.

"అట్లాగైతే కష్టం కదూ, సరిపోవాలి కదా?"

నోట్లో నుంచీ బీడీ తీసి ఉమ్మేసుకున్నాడతను. నా వైపు చూస్తూ పెదవుల అంచుల్నుంచీ చిత్రంగా నవ్వేడు. "సరిపోవటానికి అంతేంవుంది సారూ. అయినా ఒక్క పొట్టకి రెండు ముద్దలు! ఎంతగా ఆరాటపడినా, పంటికిందకి ఎంత కావాలి గనుక? తాపత్రయపడి సంపాయించి కట్టుకుపోయేదేం వుంది?"

వెన్ను జలదరించింది నాకు.

ఆ మాటలని మెట్టుకి నడ్డిని ఆనించి, చేతులు వెనక్కు మోటించి వాలాడు. హాయిగా, నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు.

అతన్ని పరీక్షగా చూశాను. ఆత్మతృప్తితో వెలిగిపోతున్న త్యాగిలా, ధ్యానముద్రలో కూర్చున్న యోగిలా తోచాడు.

విఠల్‌రావూ, కృష్ణమూర్తీ, రాజశేఖరం, రాధమ్మా, మా పిల్లలూ..... అందరూ కళ్లముందు మెదిలారు. బిజీ... బిజీ.... సంపాదన.... సంపాదన.... అనే ఘోషలో కొట్టుకుపోతున్న అనేకమంది మధ్యతరగతి అల్పజీవులు! వారి భావజాలాన్ని తలకెత్తుకుని బాల్యాన్ని పారేసుకుంటున్న రేపటిపౌరులు!

ఇటు చూస్తే, అన్ని వేదాంతాల సారంగా - బతుకు మెతుకుల్ని పంచుతూ శ్రమశక్తి! ఎన్నెన్నో జీవన విలువలకి పుటం పెట్టిన వాస్తవం! తామరాకుమీది నీటిబొట్టులా ఈ మనిషి! నిలిచి వెలుగుతున్న ఆత్మస్థైర్యం!

నా కోడలు మాటలు చెవుల్లో రింగుమన్నాయి నాకు. నా కోసం తాను శ్రమిస్తోంది.

అప్రయత్నంగా అతని పక్కగా అదే మెట్టుమీద కూర్చుండిపోయాను.

ఏదో జ్ఞానోదయం అవుతోందనిపిస్తోంది!

మనిషి మనిషికీ చెప్పాలీ కథ!